కర్నూలు టౌన్ రైల్వే స్టేషన్ చాలా సందడిగా వుంది. మరో అరగంటలో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రాబోతోంది. ట్రయిన్ ప్రయాణం కొత్తయిన వాళ్ళు, కొత్త కాపురాలకి వెళ్ళేవాళ్ళూ చాలా ఆత్రంగా, గాబరాగా వున్నారు.

# రసపల్లవం

యామినీ సరస్వతి



ప్లాట్‌ఫాంకి ఓ చివర నుంచున్నాడు రాఘవరావు. అతని ముఖం చాలా గంభీరంగా వుంది. ఏదో సాధించి 'భారత రత్న'కి సమానమైన బిరుదు పొందబోయే వీరుడిలా వున్నాడు. ఆ తృప్తి, ఆ గర్వం, ఆ ఆనందం అన్నీ ఆయన గంభీరత వెనక కన్పిస్తున్నాయి.

ఆయన దగ్గరగా ఆయన కంటే ఓ యేడాది మాత్రమే చిన్నదైన ఆయన గృహస్వామిని శారద నుంచుని వుంది. జీవితాంతం దగ్గర్లో వున్నా ఆ వస్తువు విలువ తెలియక, అది చేజారి మరొకరి సొత్తై పోతున్న సమయంలో దాని విలువ గుర్తించి పరివేదన పొందుతున్న వ్యక్తిలా వుందామె. సంభవించబోయే దుర్భర వియోగాన్ని భరించలేమన్నట్టుగా వున్నాయి ఆమె కళ్ళు.

వర్షించబోయే మేఘాలు తాము ఊషర క్షేత్రంలో వర్షిస్తోన్నందుకు విచారిస్తోన్నట్టుగా వున్నాయి ఆమె కళ్లు. ఈ దుఃఖానికి విలువలేదు. ఈ వేదనకి గుర్తింపు లేదు. ఈ బాధకి అంతం లేదు అన్నట్టుగా వున్నాయి ఆమె భావాలు.

'శారదా!' సహజసిద్ధమైన ప్రేమపూరిత స్వరంతో పిలిచాడు రాఘవ. ఇన్నేళ్లూ అడవిలో కురిసిన వెన్నెల ఇకపై రసరమ్య సౌధంపై వర్షించబోతున్న ఆనందం ఆయన కంఠంలో వుంది.

'నన్నలా పిలవకండి!' తన్ను కాస్తోన్న దుఃఖాగ్ని జనితమైన రోదనధ్వనిని, పూడుకపోతోన్న గొంతుని నిగ్రహించుకుంటూ అంది.

నిట్టూర్పు విడిచారాయన. అది ఓ

అమాయకుడైన పసిపిల్లవాడిని చూసి జాలిపడినట్టుగా వుంది.

'ఎందుకీ ఆవేదన?'

చప్పున ఆయన ముఖంలోకి చూసిందామె! మీకు తెలీదా! నన్నిలా అర్ధాంతరంగా వదిలేసి, పిల్లల్ని విడిచి ఇప్పుడిలా వెళ్ళటం.'

'శారదా! నేను పారిపోవటం లేదు. నేను నా కర్తవ్యాన్ని నిర్వర్తించాను. నీతో ముప్పై సంవత్సరాలు కాపురం చేశాను. ఏభై ఏళ్ల వయస్సు వచ్చింది నాకు. సగం జీవితం పూర్తయింది. కానీ నిజమైన దాంపత్య జీవితం పల్లవించేది యిప్పుడే.'

'హు ఈ రసపల్లవం ఏనాడో నీరసపల్లవం అయి ప్రారంభంలోనే వడిలి, వాడి పోయింది-' గుండెలో పొంగిన లావా-అయినా చల్లగానే వెలువడింది.

'ఎప్పుడూ మీరింతే. నన్ను ఏనాడూ గుర్తించలేదు. గౌరవించలేదు-'

'తప్పు-నిన్ను అర్ధాంగిగా గుర్తించి గౌరవించి ఆదరించి-'

"కానీ ప్రేమించింది మరొకర్ని— గుండెల్లోగుడికట్టింది మరొకరికి, దేవతగా ఆరాధించింది ఇంకొకర్ని.నాకు ఆ స్థానం ఏనాడూ లేదు."

అతనేం జవాబివ్వలేదు.

స్టేషన్‌లో మొదటి గంట మ్రోగింది.

"ఇంక కొన్నినిమిషాల్లో శాశ్వతంగా విడిపోతున్నాం. నా జీవితానికో గమ్యం నేను నా సలభయ్యోయేటే నిర్ణయించుకున్నాను. పదేళ్లఅందుకోసంనా సర్వస్వం ధారపోసి శ్రమించాను- మీకు అన్నీ సమకూర్చాను."

"ఏమండీ నాకు కావలసింది డబ్బేనా?" నిలదీసినట్టుగా ప్రశ్నించింది.

ఆ ప్రశ్నకి జవాబివ్వలేదు. "నీ పేర లక్ష రూపాయలు ఎఫ్.డి. వేశాను. వృత్తిరీత్యా సంపాదించిందంతా మీకే ఖర్చు చేశాను. పి.యఫ్. అమ్మాయికి ఇచ్చాను. నెలసరి పెన్షన్ నీకే రాసిచ్చాను ఈ కట్టుకున్న బట్టలు, కొనుక్కున్న టికెట్టు ఈ నాడు ఆఖరిసారిగా నువ్వుపెట్టిన కమ్మని భోజనం-'

ఆమె కళ్లు వర్షించసాగేయి.

"పెద్దవాడు బ్యాంక్ ఆఫీసరయ్యాడు. పెళ్ళైంది.ఓయింటి వాడయ్యాడు. తండ్రి కూడా అయ్యాడు భార్యా భర్తలు ఇద్దరూ ఉద్యోగులు. చీకు చింతలేని ఉద్యోగం.

"కానీ పెద్దగా మీరు-"

"ఎందుకు వాళ్లకి వాళ్ల సుఖాలకిఅడ్డు."

ఆమెకి ఏదో- గతం- గుర్తొచ్చింది. "ఇప్పుడూ చెప్పుతున్నారా?" అంది బాధగా.

అతను వినిపించుకోనట్టే అన్నాడు! 'రెండోవాడు- నీ ముద్దుల కొడుకు ఫణి. ఇంజినీర్ అయ్యాడు. పెళ్లి చేశాను. మన వరాల్ని ఎత్తుకున్నావు. వాడు నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తాననేవాడు కదా! నీ గురించి దిగుల్లేదు-"

"ఎన్నివున్నా మీరు లేని-"

"పిచ్చిదానా వయసైపోతున్నది. ఒకవేళ నేనూ మీ అన్నయ్యలాగా."

"వద్దండీ! వద్దు. మీరు ఎక్కడున్నా క్షేమంగా వుండాలి నా లుగు కా లా లం పాటు."

"ఇందులోనూ స్వార్ధమేనా? పసుపు కుంకుమలు, గాజులు,సుమంగళి చిహ్నాలు పుట్టుకతో వచ్చాయి. వాటిని భర్తతోపాటే వదిలెయ్యాలనటం ఛాందసం-అంతే కాదు మూర్ఖత్వం."

"పోనివ్వండి."

"మూడోవాడు డాక్టరయ్యాడు. ఫారిన్ వెళ్లాడు. అక్కడే తోడువెదుక్కుంటాడు. ఇక్కడ విన్నూ నన్నూ చూసి అన్నీగమనించిన వాడికి నీ లాటి ఇండియన్ వైఫ్ అంటే భయమేసింది.నన్ను రమ్మన్నాడు. కానీ ఏం వుందని నేను వెళ్లాలి. డిపెండెంట్‌గా బ్రతకలేనుకదా!"

"మీ డబ్బుతో మనం వెళదాం."

"వద్దు. మళ్ళీ నిర్ణయం మార్చుకోలేను ఇచ్చిన మాటకి కట్టుబడాలి."

మళ్లీ ఆమె ప్రశక్తి. గుండెల్లో శూలం దిగినంత వేదన కలుగుతున్న జాలి కరుడుకట్టే వైనం.

"మాలని గొప్ప డాన్సర్‌ని చేశాను. తనకి నచ్చిన వాడిని ఎన్నుకుంటే నీవు కాదన్నా ఆశీర్వదించాను. అ మ్మా యి సుఖం కంటే నీ సంప్రదాయ భా వా లు నీకు ఎక్కువయ్యాయి. అందుకే ఆమె మనకి దూరమైంది-"

"మీరు వెళ్ళొచ్చారుగా-"

రెండో బెల్ మ్రోగింది.

"నాన్నా! మరో అయిదు నిమిషాల్లో ట్రయిన్ వస్తుంది-" అంటూ వచ్చాడు ఈశ్వర్.

"నేను సిద్ధంగా వున్నాను" రాఘవ నవ్వుతూ అన్నాడు.


శారద కొడుకుకేసి సూటిగా చూసింది. "పూరెమ్మని రెండుగా చీల్చి పూ జంటని విడదీస్తున్నావ్రా" అన్నట్టు చూసింది.

"శారదా!"

"నేనూ వచ్చేస్తానండీ!" అందిఆమె. ఇన్నేళ్లుగావున్న ఠీవిఅంతాపారిపోయింది. ధైర్యం తగ్గి పోయింది, భయం పుట్టుకొస్తోంది. ఒంటరితనం రాహువులా తరుముకొస్తోంది.

"నువ్వానా?"

ఆ మాట ఆమెకి మరణ శిక్ష విధించినట్లుగా వినిపించింది. రాగ ప్రస్తారంలో



తీగ తెగినట్టు ఆలాపనవేళలో కంఠనాళం చిట్లినట్టు ఆమె నిశ్చేష్టితయై చూసింది.

మూడో బెల్ మ్రోగింది.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం. రెండు శరీరాల్ని కాక రెండు జీవితాల్ని విడదీసే శాసనంలా వచ్చేసింది రైలు. శారద అక్కడ నుంచోలేకపోయింది. ఎదురుగా వచ్చే కొడుక్కి ఎదురుగా వెళ్లింది.

*   *   *

గుంతకల్లు జంక్షన్.

వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ వచ్చే సూచనగా మూడోగంట మ్రోగింది. భుజాలు నిండుగా కప్పుకున్న శాలువాని సవరించుకొంటూ "ఇక వెళ్ళండి" అంది రుక్మిణి.

పరమశివం కళ్ళద్దాలు సవరించుకున్నాడు. అతని ముఖంలో ఏ భావం లేదు. రుక్మిణి పుట్టింటివాళ్ళిచ్చిన నగలు, ఆస్తి అంతా అతనికి అప్పగించి కట్టుకున్న సాదానేతచీరతో వెళుతోంది. ఒక మహారాణి వానప్రస్థం వెళుతోన్నట్టుగా వుంది.

"చూడు-నువ్విలా వెళ్ళిపోతే-"

"వెళితే-"

"లోకం ఏమనుకుంటుంది!"

"లోకానికి నా చరిత్రే కావాలా? ఇంకేం పనులు లేవా!"

"అబ్బాయి—"


"వాడికి పెళ్ళయింది. ఉద్యోగం వుంది. తోడుగ భార్యాబిడ్డ లున్నారు. ఏమీ లేని ఏకాకిని నేను—"

"రుక్మిణీ- నువ్వు ఏకాకివా? నేనున్నాను. పిల్లలున్నారు. ప్రేమ, అల్లుడు, మనవలు-"

"ఎందరుంటేనేం! నాగుండె చప్పుడు నాది. నా ఎదలోని సొద ఎవరు విన్నారు-నా ఆర్తి ఎవరికి కావాలి? స్నేహాన్ని గుర్తించలేదు. ఆత్మీయతని గుర్తించలేకపోయారు. మనసు విప్పి మాటాడేందుకు భయం- కాఫీ కలిపి యిచ్చేందుకు జంకు. అన్నీ ఆంక్షలు-ఆజ్ఞలు-ఎప్పుడూ ఎవరో చూస్తారు-ఏదో అంటారు అనే అర్థంలేని అనుమానాలు-మీరు- మీ అబ్బాయి - మీ అమ్మాయి-"

"వాళ్ళు నీ పిల్లలే-"

"ఊహూ ఊహూ" వారించిందామె. నేను జన్మనిచ్చిన తల్లిని-అంతే? అన్నీ మీ మాటలే- మీ ఆజ్ఞలే- మీ పెంపకమే. గాంభీర్యం-గుంభన-ఒంటెత్తుతనం నాసించాలనే బుద్ధి-"




ట్రెయిన్ ప్లాట్‌ఫాంమీదికి వచ్చింది.

"నమస్తే!" రెండు చేతులు జోడించింది. "ఏది ఏమైనా నాకు మాంగల్యం ముడివేశారు. ఇన్నేళ్ళు భరించాను. విడిపోతున్నాం. సెలవు-"

"రుక్మిణీ!"

"వెళ్ళండి!" అంటూ ట్రెయిన్‌వైపు కదిలింది. ఇన్ని సంవత్సరాలు కలిసి బ్రతికిన భర్తను విడిచిపోతున్నందుకు కానీ, కన్నకూతుర్ని, అల్లుడ్ని, కొడుకుని, బిడ్డల్ని వదిలిపోతున్నందుకుకానీ ఆమెలో పిసమెత్తు దుఃఖం లేదు.

తన జన్మజన్మల చెలికాడు - తన నెచ్చెలి - తన ప్రాణమిత్రుడు - ఆత్మీయుడు-ప్రాణాధికుడు-ఆరాధకుడుఅయిన రాఘవని కలుసుకోబోతున్నందుకుఆమెలో రససాగరం పరవళ్లు తొక్కుతోంది.

"మినీ-" పిలుపు శతకోటి వేణుస్వర గీతికలై వినిపించింది.

"రాఘవా!" పరిగెత్తినట్టే నడిచింది. అది జంక్షన్ అని కానీ కొన్నివేలమంది ఉన్నారనికానీ, ఎందరో తనని గమనిస్తారనికానీ ఆమె మనస్సులో లేనేలేదు. కదలిని చేరే నదిలా కదిలింది.

అక్కడే నుంచున్న పరమశివం విస్తుపోయాడు.

*   *   *

ఇద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు! ఏ ఉద్వేగమూ లేని భావనలు గుండెనిండా వున్నాయి. కోరుకున్నది దక్కించుకున్న ఆనందం కళ్ళలో కన్పిస్తోంది.

"మినీ-"ఆమెవైపు ఆరాధనగాచూస్తూ, "ఎన్నేళ్ళు పట్టింది నాతపస్సు ఫలించటానికి. ఇప్పటికీ నా అదృష్టంపై నాకు నమ్మకంలేదు-"

"ఇంకానా?"

"అవును" చిరుగాలికే కంపించే పల్లవంలా కదులుతున్న ఆమె పెదాలని చూస్తూ అన్నాడు.

"ఎందుకు?"

"చూడటం కూడదన్నవాళ్లు; మాటాడటం నిషేధించినవాళ్ళు అర్ధోక్తిలో స్నేహానికి ఫుల్‌స్టాప్ పెట్టినవాళ్లు-"

"ఊ- ఏం చేస్తారేం?"


"నిన్ను ఆపేస్తారనుకున్నాను-"

ఆమె అతని చేతిని అందుకుంది. ఒక శీతలకిరణం మరో వెన్నెల కెరటాన్ని స్పృశించినట్టుగా వుంది. "రఘూ"నన్నాపలేరని తెలీదా! ఆపితే ప్రాణాలు వదిలేదాన్ని - ఇన్నాళ్ళు భరించాను నరకం. బాధ్యతలు తీర్చి - డ్యూటీ దిగినట్టువచ్చేస్తున్నాను-" అంది.

"కానీ-వాళ్ళకి నీ అవసరం-"

"నాకవసరంలేదు. నా గమ్యం వేరు. నా ధ్యేయంవేరుకదా! పోయిన జీవితం పోయింది. మిగిలిన బ్రతుకునైనా పండించుకోవద్దా. కోరికలు లేవు. ఆవేశాలు లేవు. అనుమానపడరెవరు. స్నేహితుల్లా కలిసి జీవించాలనే కోరిక ఇప్పటికయినా తీరొద్దా?"

అతనామెనే చూస్తున్నాడు. వెన్నెల వీధుల్లో. వెన్నెల వీణ మీటులలో.




వెన్నెలపూలు రవళిస్తే, వెన్నెల గీతాలు పాడుతూ వెన్నెల నృత్యంచేస్తే వియచ్చరలా వుంది.

"ఎంత అందం!" అనుకున్నాడు. ఇది దేవతలకే సాధ్యం- కోరిక రగల్చకుండా మనస్సుని శాంతపరిచే ఈ సౌందర్యం తనకోసం జన్మజన్మలుగా తపించి వచ్చింది. ఇక యీ త్రయీ వేదరహస్య భావ్య సౌందర్యోపాసన తనది. రసపల్లవంలాంటి జీవితం ప్రారంభమైంది!" అనుకున్నాడు.

"రాఘవా!"

"ఊ!"

"నీ బాధ్యతలు - బరువులు".

"ఆ శరీరాన్ని వదిలేశాను. ఇది పునర్జన్మ. తపస్సు ఫలించిన జన్మ."

"రమా! నేనంటే ఎందుకింత ఆరాధన?"

"వెన్నెల అంటే ఎందుకంత యిష్టం?"

"ఏమిటి ఈ భక్తిభావం?"

"సంగీతం అంటే ఎందుకలా గుండె స్పందిస్తుంది?"

"ఎంత ప్రేమ!"

"నన్ను నేను ప్రేమించుకోవటం-"

"రా! నా గుండెలో వలపు కువకువలాడింది".

"మినీ– నీ గుండెలో గుండెనై, నీ చూపులో చూపునై, వలపులో వలపునై మాటలో భావమై, బ్రతుకులో బ్రతుకునై, గుండెలో నిలిచిపోతాను. బ్రతుకెల్లా కలిసిపోతాను".

"నీవూ నేనూ మిగిలామా ఇంకా ? మనం ఒకటయ్యాం రాఘవా! వాళ్ళు— అర్థంలా కలిసిపోయాం".

అతని చేయిని ఆప్యాయంగా స్పృశిస్తోందామె. ఆ స్పర్శ వెంట వేయి జన్మల నుండి వెన్నంటివచ్చే వేడి వెన్నెలవంటి వలపు ప్రవహిస్తోంది.

* * *

అనంతపురం స్టేషన్ వచ్చింది.

ప్రేమ, ఆమె భర్త వచ్చారు.,

"అమ్మా!" అంటూ వాళ్ళపిలుపు ప్రశాంత రాత్రిలో ప్రళయగర్జనలా అనిపించింది.

ముఖం చిట్లించింది రుక్మిణి.

"వెళ్ళిపోతున్నావా అమ్మా!"

జవాబివ్వలేదు.

"ఏమిటిది! లోకమేమనుకుంటుంది, ఈ వయస్సులో ఏమిటిది?"

"ఏమిటి అలా అంటున్నావ్? నన్ను హేళనగా అనుకుంటారా ఇంకా!ఊహూ! అనుకోనీ- నాకు ఫర్లేదు. నేను లెక్కచేయను. ఇది నా జీవితం-నా యిష్టం-"

"కానీ మేమున్నాం-"

"నా కెవరూ లేరు!" ఆయనొక్కరే వున్నారు."

మమ్మల్ని అంతా ఊస్తారు-మేం ఎలా బ్రతకాలి. ఈ అవమానం భరించలేం- చచ్చిపోతాం-"

"అది మీ యిష్టం మీ నిర్ణయం.'

"నీకు బాధగా లేదామ్మా?"నిష్ఠూరంగా అంది.

"బాధ! ఇన్నేళ్ళు నా బాధ ఎవరు చూశారు? ఎవరు గుర్తించారు? అందరూ యథాశక్తి హింసించారు. ఇప్పుడే మో వగలు ఏడుపులు-"

ట్రయిన్ కదులుతోంది.

'వెనక్కి రావా'

'ప్రేమా! నీకు తెలీదు. నేనేం పోగొట్టుకున్నానో- ఇన్నేళ్ళగా పొందలేనిది యీనాడు పొందిఎంత సంతోషంగా వున్నానో నీకు తెలీదు. వెళ్లు-'

ట్రయిన్ కదిలింది. ఆమె రాఘవ చేయి అందుకుంది. అతని స్పర్శ ఆమెకి ఓదార్పు అయింది.

* * *

హిందూపురం స్టేషన్లో ట్రయిన్ ఆగింది.

'అమ్మా!'

మధుర సంగీతాలాపనలు అపశృతిలా వినిపించింది. 'ఇంకా తనెందుకు వెన్నంటి వస్తున్నారు!' అనుకుంది. పలకలేదు.

'వెళిపోతున్నావా! అమ్మా'

'ఈ తేదీ పది సంవత్సరాలనాడే నిర్ణయమైంది.'

'కానీ అవమానం- నిందలు-'

'అవన్నీ మీకు సంబంధించినవి-'

'నీకు-'

'నా లోకం వేరు. నేను నా స్వామి-నా బ్రతుకు-పల్లవించిన రస జీవితం నాకు కావాలి.'

'నీకు లోక విమర్శ అక్కర్లేదా?'

"ఊహూ'

'నువ్వు వెళ్ళే చోటున విమర్శిస్తే-'

'విమర్శించరు-'

'మీ సంబంధం తెలిసి ఇలా నువ్వు మమ్మల్ని-ఆయన వాళ్లని వదిలి వస్తున్నారని తెలిసి మీరాక నిషేధిస్తే.'

'అలా జరగదు.'

'జరిగితే-'

"బాబూ-ఎందుకింకా యీ క్షోభ నాకు! మీరెవరో నేనెవరో ఏదో బంధం కలిసినందుకు సేవచేశాను. బాధ్యతలు తీర్చుకున్నాను. వెళుతున్నాం."

"మేము అక్కర్లేదా'

"ఊహూ.'

"అయితే నేనూ, నీ కోడలు పిల్లలు, నాన్నగారు, చెల్లాయి, బావ పిల్లలు అంతా యీ ట్రెయిన్ క్రింద పడి చస్తాం."

ఆమె గుండె కలుక్కుమంది. అయినా ఒక్కక్షణం 'మీ యిష్టం మీ నిర్ణయంతో నాకేమిటి పని?' అంది నిర్లిప్తంగా.

'అదే నీ ఆఖరి నిర్ణయమైతే-' అంటూ 'నాన్నా' అని పిలిచాడు అతను.

ఆ పిలుపు విని పక్క పెట్టెలోని పరమశివం, ప్రేమా, ఆమె భర్త, పిల్లలు వచ్చారు.

'మీరంతా వెన్నంటే వస్తున్నారా?'

'ఆ'

'నా కింకా స్వేచ్ఛ రా లే దా?' అనుకుంది.

"అమ్మా! మా అందరి దావు చూసి కూడా నీవు ఆయన వెంట వెళతావో లేక మమ్మల్ని చావొద్దని మాతో తిరిగిస్తావో నీ యిష్టం."

ఆమె జవాబివ్వలేదు.

రాఘవ అంతా గమనిస్తున్నాడు. వాళ్ల ఒక్కరొక్కరే వచ్చి మాటాడుతున్నారు.

"మనం వెళ్లిపోదాం రఘూ!"

"ఎక్కడికి వెళదాం? మినీ నువ్వూ నేనూ యిక్కడున్నా ఎక్కడున్నా ఒకటే. మనల్ని ఎవరూ విడదీయలేరు."

"నేను."

"నేనూ నువ్వూ ఏమిటీ? మనం ఒక రూపానికి బింబ ప్రతిబింబాలం. నేను వెలుగు నీవు నీడ; నేను రవిని నీవు ఛాయవి నేను పగలు నువ్వు రాత్రి. మనల్ని ఎవరూ విడదీలేరు."


"రఘూ! ఏమిటి అంటున్నావు?"

ఆమె చేతిని అప్యాయంగా స్పృశించాడు అతను. "మినీయిపుడునిన్నుస్పృశించాను. ఈ స్పర్శ ఇపుడుంది. నిన్నవుంది. రేపుంది. కాలాతీతమైన ప్రేమ మనది.'

"రాఘవా! రాఘవా!"

"ఎందుకా ఆర్తి! ఇప్పటి కెన్నేళ్లు గడిచాయి. మనం యుగయుగాలుగా కలిసే వున్నాము. ఈ సృష్టికి ఆది లేదు, మధ్య లేదు, అంతం లేదు. మన ప్రేమా అంతే! నేను శివుడిని. నువ్వు పార్వతివి. నేను బ్రహ్మను, నువ్వు వాణివి.... నేను నారాయణుడను- నువ్వు శ్రీదేవివి. నేను మన్మధుడిని-నువ్వు రతివి. ఇంకా చెప్పాలంటే నేను భర్తను- నువ్వు భార్యవి. మనం ద్వంద్వం. మనకి వియోగ మెక్కడిది?

ఆశ్చర్యంగా చూస్తోంది ఆమె.




"మినీ నేను శబ్దాన్ని నువ్వు-వాక్కువి నేను వేదం నువ్వు భాష్యం-నేను జ్ఞేయం నువ్వు జ్ఞానం."

"రాఘవా!"

"అవును మినీ! అంతా కాలబద్ధులు. మనం కాలాతీతులం. కానీ యిప్పుడు ఈ శరీరం కొంత బంధనాలకి లొంగిపోయింది. ఈ రూపంలో మనం కొన్నిటికి బద్ధులం కావాలి."

"అంతేకాదు." అతనాగిమళ్ళీ అన్నాడు.

"మినీ మనం సంఘ జీవులం. ఎంత కాదన్నా యీ లోకంలో జీవిస్తోన్నందుకు మనం కొన్ని పాటించాలి. ఒక ఇంటి యిల్లాలో.... భర్తని. పిల్లల్ని. సంసారాన్ని త్యజించి తన ఆరాధకుని వెంట వెళితే లోకం ఓర్చుకోదు. చెలరేగే కోరికలు చల్లారినా ఇంకా అపనిందలే వేస్తుంది. ఒక యువకుడిని. అతని సంసారాన్నిరొదచేసి తన వెంట తీసికెళితే ఆమెని లోకం మన్నించదు.

"వర్లేను నువ్వెళ్లు-నే తిరిగి ఆ యమ లోకంలోకి వెళ్లలేను నాకు తెలుసు. నీకు సుఖం లేదు. శాంతి లేదు-కానీ కర్తవ్యం. ధర్మం నిన్ను తిరిగి బంధిస్తున్నాయి. ఇదే మన యీ సమాజంలోనితేడా 'నాకు నీకు వున్న అంతరం. అది ఒక మగకి. స్త్రీకివున్న అంతరం."

ఆమె ప్రాణం లేనట్టుగా నించుంది.

"మినీ-"

"రాఘవా! నువ్వు నాతో వచ్చెయ్. వీళ్లకి నేను కావాలి. నాకు నువ్వుకావాలి."

అతను నవ్వేడు. "ఇది మరీ అసంభవం."

ఆ మాట వినగానే వాళ్లంతా ఊపిరి పీల్చుకున్నారు.

"నాకో మాట యివ్వండి!"

"ఏమిటి?"

"మీరు నా చివరి సమయంలో నాసన్నిధిలో వుండాలి. అంతే! అదయినా నాకు దక్కనివ్వండి. మీ ఒడిలో తప్ప నా ప్రాణాలు పోవు. నన్ను మరణ యాతన పడనివ్వకండి!"

"అలాగే! తెలిస్తే వస్తాను."

"ప్రామిస్!" అన్నాడు పరమశివం.

రైలు కూతేసింది.... రాఘవ ట్రెయిన్లో కూర్చున్నాడు. తన ప్రాణం, ప్రేమ జీవం జీవనం అన్నీ అతని కప్పగించి కేవలం శరీరం మిగిలినట్టుగా ఉండిపోయింది రుక్మిణి.

ఆ రూపం. ఆ శరీరం, ఆ మనిషి కనుమరుగయ్యేదాకా అలాగే చూస్తూ వుండిపోయింది.

అతని వెంటే తన చూపులోని ఆత్మీయత. గుండెలోని ప్రేమ. మనస్సులోని ఆరాధన, బ్రతుకులోని కమ్మదనం. అర్పించినట్టుగా నించుండిపోయిందిఆమె.

అన్నీ పోయినా. ప్రాణంలేని శిలలాగా నయినా ఆమె తమతో వుంటేచాలు అనుకునే ఆ "అందరూ" ఆమెతోపాటు తమ రైలు కోసం ఎదురు చూడసాగారు.

యాంత్రిక జీవనానికి బలవుతున్నది రుక్మిణి. ●